కేన్సర్ నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో కేన్సర్ స్క్రీనింగ్‌పై సమీక్షించారు. రోహిణి ఫౌండేషన్ ద్వారా పది గ్రామాల్లో పర్యటించి 2 వేలకుపైగా ప్రజలను స్క్రీనింగ్ చేశామని తెలిపారు. 104 మందికి కేన్సర్ గుర్తించగా, వీరిలో 90 మంది స్టేజీ 3, 4 దశలలో ఉన్నారని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేన్సర్ వల్ల కలిగే అనర్థాలు ప్రజలకు వివరించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. 30 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు వారిని ఎన్‌సీడీ సర్వేలో భాగంగా నోటి కేన్సర్ పరీక్షలు చేసి, అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. రోగులకు చికిత్స అనంతరం చెడు అలవాట్లకు బానిస కాకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఆశా కార్యకర్తల ద్వారా రోగులకు అవగాహన కల్పించాలని, సరైన చికిత్స తీసుకుంటూ అలవాట్లు మార్చుకుంటే నయం చేయవచ్చనే భరోసా కల్పించాలన్నారు. జిల్లాలో 8 లక్షల జనాభా ఉందని, ఇందులో 5 వేల వరకు క్యాన్సర్ కేసులు ఉండే ఆస్కారం ఉంటుందని, వీరికి ఎలాంటి చికిత్స అందించాలనే దానిపై ప్రణాళికలు తయారు చేయాలని పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారి అన్న ప్రసన్న కుమారితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

త్వరలో 24 గంటల ప్రసూతి సేవలు


ఆసుపత్రి భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ధర్మారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లో త్వరలో 24 గంటలు ప్రసూతి సేవలు అందుబాటులో ఉంటాయని వైద్య విధాన పరిషత్ జిల్లా పర్యవేక్షకులు డాక్టర్ శ్రీధర్ అన్నారు. నంది మేడారంలో నిర్మించిన సీఎస్‌సీ సెంటర్‌ను గురువారం డాక్టర్ సుష్మితతో కలిసి పర్యవేక్షించారు. భవన నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే బిల్డింగ్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలకు సేవలందించేందుకు అన్నిరకాల పరికరాలతో పాటు సిబ్బందిని సిద్ధం చేసుకున్నామని, ఇటీవల నూతనంగా రిక్రూట్ అయి పెద్దపల్లిలో సేవలందిస్తున్న వైద్య సిబ్బందిని అవసరమైతే నందిమేడారంలో వాడుకుంటామని పేర్కొన్నారు. 5 కోట్ల 75 లక్షలతో జనవరి 2023లో శంకుస్థాపన చేసిన ఈ భవనం, ఇప్పుడు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉందని, త్వరలోనే ప్రారంభించి గైనిక్, పీడియాట్రిక్, అనస్థీషియా డాక్టర్లను నియమించి ప్రసూతి సేవలను 24 గంటలు అందుబాలోకి వచ్చేటట్లు చూస్తామన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి



పోస్టర్ ప్రదర్శిస్తున్న న్యాయమూర్తి సునీత

పెద్దపల్లిటౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టులో ప్లాస్టిక్‌ను నిషేధించాలని, అడ్వకేట్లు, కక్షిదారులు, సిబ్బంది క్యారీ బ్యాగులతో వస్తేనే అనుమతిస్తామన్నారు. ప్లాస్టిక్ కవర్స్ బదులు క్లాత్ బ్యాగ్స్, జ్యూట్ బ్యాగులు తీసుకురావాలని సూచించారు. ప్లాస్టిక్‌తో పర్యావరణం దెబ్బతింటుందని, భూమిలో వందల ఏళ్ళకు కూడా కరిగిపోవన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. కే.స్వప్న రాణి, సెక్రటరీ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, భాస్కర్, కోటగిరి శ్రీనివాస్ న్యాయవాదులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు భవనాన్ని పరిశీలించిన జడ్జి

ఓదెల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయనున్న నూతన కోర్టు భవనాన్ని గురువారం జిల్లా జడ్జి కుంచాల సునిత సందర్శించారు. అనంతరం భవనంలోని ఫర్నీచర్, ఛాంబర్, కోర్టు హాల్, కక్షదారులు వేచి ఉండే ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే పార్కింగ్ స్థలంతోపాటు వసతులను పరిశీలించారు. భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం వద్ద ఉన్న గెస్ట్ హౌజ్‌లో ఉన్నతాధికారులు ఉండేందుకు అనుకూలమైన సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. కోర్టు అధికారులు, న్యాయవాదులు యుగేందర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మోక్షం

- జిల్లాలో 1038 ఇళ్లు పూర్తి చేసేందుకు చర్యలు
- మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల
- ఆగస్టు 15 నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు



కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో పూర్తయిన డబులు బెడ్ రూం ఇళ్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో పలు చోట్ల నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు కావాల్సిన నిధులను డిఎంఎఫ్‌టి, గృహ నిర్మాణ శాఖ ద్వారా సుమారు తొమ్మిది కోట్ల పైచిలుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కొన్నిచోట్ల పనులు ప్రారంభం కాగా కొన్ని టెండర్ల దశలో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. జిల్లాలోని పెద్దపల్లి, మంథని, కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, రామగుండం, తదితర ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణా లను చేపట్టింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం 5 లక్షల 4 వేల రూపాయల నిధులు కేటాయించగా, మౌలిక వసతుల కల్పన కోసం లక్షా 24 వేల రూపాయలను కేటాయించింది. అయితే బీఆర్ఎస్ హయాంలో కేవలం మంథని పట్టణంలోని పోచమ్మ వాడలో మాత్రమే 92 ఇండ్లను పూర్తి చేశారు. ఇందులో 75 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి, చందపల్లిలో, కాల్వ శ్రీరాంపూర్, ఓదెల మండల కేంద్రాల్లో ఇండ్లు పూర్తి చేసినప్పటికీ మౌలిక సదుపాయాలను కల్పించలేదు. రామగుండం లోను పలుచోట్ల ఇళ్ల నిర్మాణాలు పూర్తి దశకు చేరగా మౌలిక సదుపాయాలు కల్పించలేదు.

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుత ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకువచ్చింది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇండ్లను కేటాయించింది. మొదటి విడతలో సొంత స్థలం ఉన్న వారికి ఇండ్లు మంజూరు చేశారు. అయితే గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎక్కడైతే ఇండ్ల నిర్మాణాలు పూర్తయి మౌలిక వసతులు లేని వాటిని అందుబాటులోకి తీసుకు రావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఇప్పటికే జిల్లాలోని రాంపల్లి, చందపల్లిలో నిర్మించిన 484ఇండ్ల వద్ద రోడ్ల నిర్మాణాలు, మురికి కాలువలు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు సుమారు 9 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఆ నిధులతో యుద్ధ ప్రాతిపదికన 10 నెలల్లో పనులు పూర్తి చేసి గత నెలలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఇండ్లను పంపిణీ చేసి గృహప్రవేశం చేయించారు.

కాల్వ శ్రీరాంపూర్, ఓదెలలో మొదలైన పనులు

పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ పూర్తయిన వెంటనే ఎమ్మెల్యే విజయరమణారావు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి దృష్టికి కాల్వశ్రీరాంపూర్, ఓదెల ఇండ్లను పంపిణీ చేసేందుకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రామగుండంలో గల 650 ఇండ్ల నిర్మాణా లను పూర్తిచేసేందుకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ నిధులు విడుదల చేయాలని కోరడంతో నిధులను మంజూరు చేశారు. దీంతో కాల్వశ్రీరాంపూర్, ఓదెలలో పనులు ప్రారంభమయ్యాయి.

- ఓదెల మండల కేంద్రంలో నిర్మించిన 144 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు విద్యుత్ సౌకర్యం కోసం 20 లక్షల 83 వేలు, మురికి కాలువల కోసం 42 లక్షలు, తాగునీటి పనుల కోసం 80 లక్షల నిధులు మంజూరు చేశారు.
- కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో నిర్మించిన 240 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం విద్యుత్ సౌకర్యానికి 18 లక్షలు, తాగునీటి సరఫరా కోసం 74 లక్షలు, మురికి కాలువ నిర్మాణాలకు 56 లక్షల నిధులు మంజూరు చేశారు.
- రామగుండం పట్టణంలో నిర్మించిన మిగతా 8వపేజీలో..

రాష్ట్రంలో రాబోయేదీ బీజేపీ ప్రభుత్వమే


కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న గుజ్జుల రామక్రిష్టారెడ్డి

ధర్మారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమని, కార్యకర్తలు పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని మాజీ శాసనసభ్యులు, జాతీయ కౌన్సిల్ మెంబర్ గుజ్జుల రామక్రిష్ణారెడ్డి అన్నారు. ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా 'వికసిత్ భారత్ అమృతకాల సేవ, సుసరిపాలన, పేదల సంక్షేమానికి 11 సంవత్సరాలు' పేరుతో సమావేశం నిర్వహించారు. గుజ్జుల మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గంలో జడ్‌పీటీసి, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే నాయకులు సిద్ధంగా ఉండాలని సూచించారు. 10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ పార్టీ కమీషన్ల కోసం కాళేశ్వరం కట్టిందని, ప్రస్తుతం ఆ ప్రాజెక్టును వాడకున్న తెలంగాణలోని రైతులు పంట దిగుబడి బ్రహ్మాండంగా వస్తుందని, అలాంటప్పుడు కాళేశ్వరంతో పనేంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారానే రాష్ట్ర ప్రభు త్వాలు నడిపిస్తున్నాయని, ఈ విషయాలను ప్రతీ కార్యకర్త ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. కాసిపేట లింగయ్య మాట్లాడుతూ దేశంలో 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ అనేక కుంభకోణాలకు పాల్పడగా, రాష్ట్రంలో 10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల సంక్షేమే ధ్యేయంగా 11 సంవత్సరాల సుపరి పాలనను బీజేపీ పూర్తి చేసుకుందని సంతోషం వ్యక్తం చేశారు. ధర్మారం చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దేవి రాజలింగయ్య, ధర్మపురికి చెందిన ఇందారపు వాసు బీజేపీలో చేరారు.

పోలీసులు బల్ల కింద చేయి పెట్టనిదే రోజు గడవదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు గుజ్జుల కౌంటర్ ఇచ్చారు. కొప్పుల ఈశ్వర్‌కు పదవి పోయాక అవినీతిపై జ్ఞానోదయం కలిగిందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ పాలనలో అవినీతి జరిగిందని ఈశ్వర్ పరోక్షంగా ఒప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము రాంబాబు, జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, కన్నం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం జోన్‌కు పేరు తీసుకురావాలి : సీపీ అంబర్ కిశోర్ ఝా


పోలీస్ జాగిలాన్ని పరిశీలిస్తున్న సీపీ

కోల్‌సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగే పోటీల్లో రాణించి కాళేశ్వరం జోన్‌కు మంచి పేరు తీసుకురావాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. కమిషనరేట్‌లో జరుగుతున్న కాళ్వేరం జోన్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను పరిశీలించారు. మొదట పోలీస్ జాగిలాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. నేరస్థలాల్లో బాంబులు, గంజాయి, మాదక ద్రవ్యాలను గుర్తించే విధానాన్ని డాగ్ హ్యాండ్లర్స్ సీపీకి వివరించారు. డీప్ సర్చ్ మెటల్ డిటెక్టర్ ద్వారా భూమిలో పాతిపెట్టిన మందు గుండు సామగ్రి, అనుమానాస్పదమైన, ప్రమాదకరమైన ఇనుప వస్తువులను ఏ విధంగా గుర్తిస్తారో బాంబ్ డిస్పోజల్ టీమ్ చేసి చూపించారు. సీపీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బందిలోని సామర్థ్యం వెలికి తీసేందుకు పోలీస్ డ్యూటీ మీట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం చాలా కీలకమన్నారు. కాళేశ్వరం జోన్ మీట్‌లో 91మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, డాగ్ హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబుడిస్పోజల్, ఫోటో, వీడియోగ్రఫీ విభాగాల్లో పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరిచిన వారిలో వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపిక చేస్తామని సీపీ తెలిపారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, ఏసీపీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బాబురావు, ఆర్ఐలు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ దందా కోసమే రింగ్ రోడ్

రూ. మూడు వందల కోట్ల ప్రజాధనం వృథా


ఫొటోలు చూపుతూ మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కూచిరాజ్‌పల్లి శివారులో రియల్ ఎస్టేట్ దందా నడిపించడానికి ఎమ్మెల్యే పట్టణ శివారులో రింగ్‌రోడ్ పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. ఇటీవల మంత్రి రింగ్ రోడ్ పనులకు శంకుస్థాపన చేసిన స్థలంలో గురువారం మాజీ ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. రియల్ ఎస్టేట్‌లో సోదరుడికి వాటా ఉండటంతో రింగ్ రోడ్‌ను ఈ భూముల సమీపంగా తీసుకెళ్ళే విధంగా ప్లాన్ చేశారన్నారు. రూ.300 కోట్లతో నిర్మించే రింగ్ రోడ్ నిర్మాణం వలన మంథని ప్రాంత ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. రింగ్ రోడ్డు నిర్మించే సమీపంలోనే నేషనల్ గ్రీన్ ఫీల్డు హైవే నిర్మాణం కొనసాగుతుందన్నారు. పుట్టపాకకు సమీపం నుంచే రింగ్ రోడ్డు ప్రారంభించి మల్లెపల్లి సమీపంలోని ఇంటర్ చేంజ్‌కు పక్క నుంచే గోదావరి నది వరకు నిర్మిస్తే మంథని ప్రజలకు ప్రయోజనం ఉండదన్నారు. రింగ్ రోడ్డు నిధులతో మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిని ఆనుకొని కూచిరాజ్‌పల్లి నుంచి బొక్కలవాగు, గొల్లగూడెం, బోయినిపేట, దొంతులవాడ మీదుగా గోదావరిఖని పాత రోడ్, బస్సు డిపో నుంచి ఎక్లాస్‌పూర్ వరకు బైపాస్ రోడ్డు నిర్మిస్తే రాకపోకల సులభంగా ఉంటుందన్నారు. ఆరెంద, అడవిసోమన్‌పల్లిల వద్ద మానేరు నదులపై వంతెనలు, నాగులమ్మ క్రాస్‌రోడ్డు వద్ద బ్రిడ్జిని ఇతర జిల్లాల రవాణా సౌకర్యం మెరుగు పడుతుందన్నారు. మంథని పట్టణంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించవచ్చన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, ప్రజలకు ఉపయోగ పడలాన్నదే తమ తపన అన్నారు. ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, గొబ్బూరి వంశీ, జంజర్ల శేఖర్, శ్రీనివాస్, తిరుపతి, సత్యనారాయణ, ఆసీఫ్, ఇర్ఫాన్, యాకూబ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో క్లిష్టమైన శస్త్ర చికిత్సలు

పెద్దపల్లిటౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు క్లిష్టమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని డిసిహెచ్‌ఎస్, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ అభినందించారు. పోతుల స్రవంతి గాల్ బ్లాడర్‌లో స్టోన్‌తో ఇబ్బంది పడుతుంది. కడుపు నొప్పితోపాటు ఇతర సమస్యలు తలెత్తడంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. గడ్డం కవిత బల్కి యూట్రస్ ఫైబ్రైడ్ సిస్టుతో బాధపడగా రెండు రోజుల క్రితం వైద్య పరీక్షలు చేశారు. వీరికి ఆపరేషన్ కోసం సిఫార్సు చేశారు. ఇరువురికి గురువారం లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్, జనరల్ సర్జన్ సాయిప్రసాద్, స్త్రీల వైద్య నిపుణులు అనసూయ, భవాని, కృష్ణవేణి అనస్తీసియా డాక్టర్ స్వాతి ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారు. క్లిష్టమైన శస్త్ర చికిత్సలను మాతా శిశు ఆసుపత్రిలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు.

ఆగని రైళ్లు.. ప్రయాణికుల అగచాట్లు



పెద్దపల్లి రైల్వే జంక్షన్

- పెద్దపల్లి రైల్వేస్టేషన్ జంక్షన్‌గా అభివృద్ధి
- రద్దీ ఉన్నా హాల్టింగ్ ఇవ్వని అధికారులు
- రైల్వే అధికారులకు, ఎంపీలకు వెల్లువెత్తుతున్న వినతులు

పెద్దపల్లిటౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వే జంక్షన్‌లో పలు సూపర్ ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్ళు నిలుపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులకు, ఎంపీలకు రైళ్ల హాల్టింగ్ కోసం ప్రజలు వినతిపత్రాలు అందజేస్తున్నారు. పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ను జంక్షన్‌గా అభివృద్ధి చేశారు. అలాగే ఇక్కడ బైపాస్ రైల్వే స్టేషన్ కూడా ఏర్పాటు అవుతోంది. ఇక్కడ పలు ప్యాసింజర్ రైళ్ల నిలుపాలని కోరుతున్నారు. నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్ ముంబయి నుంచి ఆదిలాబాద్ మీదుగా బల్లార్ష వరకు వెళ్తుంది. బల్లార్షలో 18 గంటలు నిలిపి ఉంటుంది. అలాగే బల్లార్ష టు ఖాజీపేట అజ్నీ ప్యాసింజర్ ఖాజీపేటలో 14 గంటలు నిలిపి ఉంచుతున్నారు. నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌ను బల్లార్ష నుంచి ఖాజీపేట వరకు ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. బల్లార్ష, ఖాజీపేట, అజ్నీ ప్యాసింజర్‌ను చర్లపల్లి టెర్మినల్ వరకు ఎక్స్‌టెన్షన్ చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. నూతనంగా ప్రారంభమవుతున్న 20625/26 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి భగత్‌కి కోటి (జోధ్‌పూర్) నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు రైల్వే అధికారులు పెద్దపల్లి జంక్షన్ లో హాల్టింగ్ కల్పించలేదు, ఈ రైలు అహ్మదాబాద్ నుంచి రాజస్థాన్‌లోని మహేసన, బిల్డి, మార్వార్, జాలోర్, సంధారీ, లునీ రైల్వేస్టేషన్‌ల మీదుగా వెళ్తుంది, ఈ రైలుకు వరంగల్ నుంచి బల్లార్షా మధ్యలో ఎక్కడ హాల్టింగ్ లేదు. పెద్దపల్లి, మంచిర్యాలలో రైలుకు నిలుపుదల చేస్తే పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో ఉన్న ఇతర రాష్ట్రాల వారికి ఉపయోగంగా ఉంటుంది. ఈ రైలుకు పెద్దపల్లి జంక్షన్‌లో హాల్టింగ్ కల్పించాలని కోరుతున్నారు. నవజీవన్ సూపర్‌ఫాస్ట్ రైలుకు పెద్దపల్లి నుంచి ప్రయాణికుల తాకిడి పెరిగింది. పెద్దపల్లిలో జీటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, ఏపీ సంపర్క్ క్రాంతి ట్రై వీక్లీ సూపర్‌ఫాస్ట్, తిరువనంతపురం స్వర్ణ జయంతి వీక్లీ సూపర్‌ఫాస్ట్, వైన్ గంగా బై వీక్లీ సూపర్‌ఫాస్ట్, అయోధ్య నుంచి రామేశ్వరం వీక్లీ ఎక్స్‌ప్రెస్, కాశి తమిళ సంగమం వీక్లీ ఎక్స్ ప్రెస్, గోవా వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్ళు నిలుపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎక్స్‌టెన్షన్‌తో ప్రయాణికులకు సౌకర్యం

నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్ బల్లార్షా నుంచి కాజీపేట వరకు పొడిగిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం ఆదిలాబాద్ నుంచి కాజీపేట లేదా వరంగల్ వెళ్లాలంటే కృష్ణా ఎక్స్ ప్రెస్ ద్వారా వయా ముద్ఖేడ-నిజామాబాద్-మౌలాలి మీదుగా చుట్టు తిరుగుతూ 150 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తుంది. ఒకవేళ ఈ రైలు కాజీపేట పొడిగిస్తే కాజీపేటలో 11 గంటలు నిలిపి ఉంటుంది. ప్రస్తుతం కాజీపేట - బల్లార్షా సెక్షన్ పరిధిలోని జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రజలు ముంబయి వెళ్ళాలంటే ఒక్క రెగ్యులర్ రైలు లేదు, పెద్దపల్లి జిల్లా ప్రయాణికులు ముంబయి వెళ్లాలంటే కాజీపేట జంక్షన్ వెళ్లి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ లేదా విశాఖపట్నం నుంచి ఎల్‌టిటి ద్వారా వెళ్ళాల్సి వస్తుంది, లేదా నిజామాబాద్ జంక్షన్‌కి వెళ్ళి అక్కడి నుంచి దేవగిరి ఎక్స్‌ప్రెస్ దగ్గర వెళ్తున్నారు. పెద్దపల్లి జంక్షన్‌లో పలు రైళ్ళు నిలిపేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీ గడ్డం వంశీకృష్ణలను కోరుతున్నారు.


ఆధునికీకరణకు ముందు రైల్వే స్టేషన్

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

పాస్‌పోర్ట్ పోయినది
★ యెద్ల రాకేష్‌రెడ్డి S/o. రవీందర్‌రెడ్డి, R/o. ఇంటి నెం. 8-6-353/2/a/1, రోడ్ నెం.5, అల్కాపురికాలనీ, కరీంనగర్, నేను మా ఇంటి నుండి బయటికి వెలుతున్న ప్రయాణంలో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. పాస్‌పోర్ట్ నెం. R0617131 దొరికినవారు తెలుపగలరు. సెల్: 7353336676
AJK-16964

పాస్‌పోర్ట్ పోయినది
★ లింగంపల్లి సాయి శివాణి W/o. యెద్ల రాకేష్ రెడ్డి, ఇంటి నెం. 8-6-353/2/a/1, రోడ్ నెం.5, అల్కాపురికాలనీ, కరీంనగర్, నేను మా ఇంటి నుండి బయటికి వెలుతున్న ప్రయాణంలో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. పాస్‌పోర్ట్ నెం. S5082612 దొరికినవారు తెలుపగలరు. సెల్: 7353336676
AJK-16964

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 9985411262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 9985411063
పెద్దపల్లి :- 9550900238

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గంగాధర, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయనకథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన వే ముల రవి(42), తన కొడుకు, తమ్ముడితో కలిసి టీఎస్ 21ఎఫ్ 0742నంబరు గల ద్విచక్రవాహనంపై గతనెల 30న కరీంనగర్ నుంచి జగిత్యాల వస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని గంగాధర మండలం మధురానగర్ శివారులో కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీజీ 02టీ 1770) సైడు నుంచి ఢీకొట్టింది. దీంతో బైకుపైనున్న ముగ్గురు కిందపడగా రవికి బలమైన గాయాలతో తీవ్ర రక్తస్రావమైంది. గాయపడిన బాధితులను కరీంనగర్‌కు తరలించగా రవి చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడు రవి తండ్రి వేముల లచ్చయ్య ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒంటరితనం భరించలేక బలవన్మరణం

ఇల్లంతకుంట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపల్లి గ్రామానికి చెందిన దండు శ్రీనివాస్(40) అనేవ్యక్తి ఒంటరితనం భరించలేక క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దండు శ్రీనివాస్ వివాహం అనంతరం కొద్దిరోజులకే విడాకులు తీసుకున్నాడు. గత 13 సంవత్సరాలుగా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామంలో తన అక్క రాజవ్వ వద్ద ఉంటున్నాడు. కళ్లు సరిగా కనిపించకపోవడం, జీవితంపై విరక్తి చెంది రెండు రోజుల క్రితం తన అన్న ఉండే గాలిపల్లి గ్రామానికి వచ్చాడు. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగిన మహిళ

● చికిత్స పొందుతూ మృతి

ఇల్లంతకుంట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఏగుర్ల శైలజ(28) అనే వివాహిత చికిత్స పొందుతు మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శైలజ బుధవారం ఇంట్లో క్రిమిసంహారక మందుతాగి అపస్మారక స్థితికి చేరుకోగా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలికి 17 నెలల కుమారుడు ఉన్నాడు. ఎస్సై సిరిసిల్ల అశోక్‌ను వివాహిత మృతిపై వివరణ కోరగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

ధర్మపురి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఒడ్డెరకాలనీకి చెందిన అలకొండ శ్రీవాణి(32) అనేవివాహిత బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బోయిన్‌పెల్లి మండలంలోని విలాసాగర్‌కు చెందిన శ్రీవాణికి 15ఏళ్లక్రితం ధర్మపురికిచెందిన అలకొండ సమ్మయ్యతో వివాహం జరిగింది. వివాహం జరిగిన కొత్తలో భార్యాభర్తల మధ్య గొడవల వల్ల పెద్దమనుషుల సమక్షంలో పరిష్కరించుకున్నారు. ఈనెల 2న ఇంటిలో పిల్లలతో గొడవపడి శ్రీవాణి క్షణికావేశంలో తనచీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. చుట్టుపక్కల ఉన్న బంధువులు కిటికీలు పగులగొట్టి లోనికి ప్రవేశించి వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియదని అన్నారు. మృతురాలు శ్రీవాణి తండ్రి సంపంగి నర్సయ్య ఫిర్యాదు మేరకు శవపంచనామా జరిపి పోస్టుమార్టం కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి పంపించినట్లు ఆయన తెలిపారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రుద్రంగి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలకేంద్రం శివారులో గురువారం ఉదయం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మండలకేంద్రం శివారులోని పల్లెప్రకృతి సమీపంలోని గుట్ట ప్రాంతంలో ఓచెట్టుకు ఉరివేసుకొని ఉన్న వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గొర్లకాపరి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనాస్థలానికివెళ్లి పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోవడంతో తల చెట్టుకు వేలాడుతుండగా, మొండెం కిందపడి గుర్తుపట్టలేని స్థితిలో ఉందని పోలీసులు తెలిపారు. మృతుడు ఫుల్ చేతుల షర్టు, నీలి రంగు డబ్బాల లుంగీ ధరించి ఉన్నాడు. మృతుడు సుమారు 30రోజుల క్రితంచనిపోయి ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. గుర్తుతెలియని, అనుమా నాస్పద మృతికింద కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రెండు వేర్వేరు కేసుల్లో ముగ్గురు నిందితులకు జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాలో గతంలో నమోదైన రెండువేర్వేరు కేసుల్లో ముగ్గురు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ గురువారం కరీంనగర్ సెకండ్ అడిషనల్ జెఏంఎఫ్‌సీ కోర్టు జడ్జి జె వెంకటసత్యరాజకిరణ్ తీర్పు వెలువరించారని కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వల్లంపహడ్‌కు చెందిన ఒడ్నాల రవీందర్ కొడుకుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని 1లక్షా 20వేల రూపాయలు తీసుకుని మోసం చేసిన కేసులో నిందితులు వొడ్నాల శ్రీనివాస్, కరీంనగర్‌కు చెందిన పెంచాల మాధవ్‌లకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, 2 వేల రూపాయల జరిమానాను కోర్టు విధించిందని సీఐ తెలిపారు. అదే విధంగా కరీంనగర్ రూరల్ మండల పరిధిలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతికి కారణమైన లారీడ్రైవర్ మానకొండూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన మాదాసు తిరుపతికి కోర్టు ఏడాది జైలుశిక్ష, వెయ్యిరూపాయల జరిమానా విధించిందని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ నేరాలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేయడమే కాకుండా, వారికి తగిన శిక్షలు పడే విధంగా సాక్షులను కోర్టులో ప్రవేశపెడుతున్నా మని అన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

రాయికల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం కట్కాపూర్-తాట్లవాయి గ్రామాల మధ్య గురువారం ఆర్టీసీబస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ప్రయాణికులకు ఎలాంటిగాయాలు కాకపో వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జగిత్యాల నుంచి దావన్‌పెల్లి వెళ్తున్న ఆర్టీసీబస్సు గురువారం సాయంత్రం దావన్‌పెల్లినుంచి తాట్ల వాయికి వస్తుండగా అదుపుతప్పి రోడ్డుకు పక్కకు దూసుకెళ్లింది. వర్షాల వల్ల రోడ్డు పూర్తిగా చెడిపోవడంతో బస్సు అదుపు తప్పిందని డ్రైవర్ తెలిపాడు.

మోతాదు మించితే ప్రమాదమే..



యూరియా వినియోగంపై అవగాహన సదస్సులు

రైతులను చైతన్యపరుస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కోరుట్ల రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సాగులో మోతాదును మించి యూరియాను వినియోగిస్తే జరిగే నష్టాన్ని అన్నదాతలకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ ప్రాంతీయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో ప్రతీ గ్రామంలో రైతులకు సాగులో పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పిస్తూ చైతన్యం నింపుతున్నారు. ఏ పంటకు ఎప్పుడెప్పుడు ఎంత యూరియా వాడాలనే అంశాలపై రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహిస్తు న్నారు. వివిధ క్లస్టర్లలో నమోదైన రైతు ఫోన్ నంబ ర్లకు మెస్సేజ్‌లు వచ్చేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వరికి యూరియా వాడే విధానం..

వరి పంటకు మూడు దశల్లో యూరియా వాడాలి. నాటిన సమయంలో లేదా 20 రోజుల తరువాత ఎకరానికి 30 కిలోల యూరియా వేయాలని శాస్త్రవే త్తలు సూచిస్తున్నారు. రెండో దఫా 35 రోజుల నుంచి 40 రోజుల మధ్య 30 కిలోలు వాడాలి. మూడో వంతు యూరియా 55 నుంచి 60 రోజులకు గుత్తి ఏర్పడే దశలో 30కిలోలు వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.

మొక్కజొన్న పంటకు...

ఎకరానికి 90 కిలోల నుంచి 100 కిలోలు వివిధ దశల్లో వేయాలి. విత్తే సమయంలో 20 కిలోల యూరియా, 25 రోజుల నుంచి 30 రోజుల వద్ద ఎదుగుదల దశలో 40 కిలోలు వాడాలి. 45 రోజుల నుంచి 50 రోజుల వద్ద పుష్ప దశలో 40 కిలోల యూరియాను వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.

పసుపు పంటకు...

ఎకరానికి 60 కిలోలు వాడాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మొలక వచ్చిన 30 రోజల తర్వాత మొదటి మోతాదు 30 కిలోలు, 60 నుంచి 75 రోజల సమయంలో రెండో విడత 30 కిలోల వాడాలని సూచి స్తున్నారు. ఎక్కువ నత్రజనక వాడకం వలన ఆకుల అభివృద్ధి ఎక్కు వై వేర్ల అభివృద్ధి తక్కువ అవుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరి స్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

నాగమణి, మండల వ్యవసాయ అధికారి, కోరుట్ల




యూరియా వినియోగంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. అన్ని పంటల సాగుపై అవగాహన ఉండే విధంగా వ్యవసాయ శాస్త్రవేతలతో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ అన్నదాతల్లో చైతన్యం నింపుతున్నారు. ప్రతి రైతుకు సాగులో మెళకువలు వివరిస్తున్నాం.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

షమీనా, ఏఈవో




సాగులో మెళకువలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తున్నాం. అంతర్ పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం. రైతులు శాస్త్ర వేత్తల సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలి.



ఎస్సారెస్పీకి పెరుగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 8,718 క్యూసెక్కుల నీరు రాక



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డ్యామ్

జగిత్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీరు పెరుగుతోంది. డ్యామ్‌లోకి 8,718 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యంకు గానూ ప్రస్తుతం 17.103 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 11.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 635 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్1 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.080 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 1.765 టీఎంసీల నీటిని వ్యయం చేశారు.

త్వరలో రాజన్న ఆలయ విస్తరణ పనులు

● గోశాల నిర్మాణానికి 40 ఎకరాల స్థల సేకరణ ● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న తుని పీఠాధిపతి, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయవిస్తరణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. తుని పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామితో కలిసి ఆయన రాజరాజేశ్వరస్వామిని గురువారం దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయట్రస్ట్ ఆధ్వర్యంలో పార్వతి రాజరాజేశ్వర అఖిలభారత వేదశాస్త్ర స్మార్త ఆగమ విద్వత్ సదస్సును ప్రారంభించారు. సదస్సులో భాగంగా వేదపండితులకు చతుర్వేద స్మార్త పరీక్షలు నిర్వహించి వారికి పట్టాలు అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో తిరుమల తిరుపతిలో నిర్వహించే పరీక్షలు ఇప్పుడు రాజన్న సన్నిధిలో నిర్వహించడం ఈ ప్రాంతవాసుల అదృష్టమన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షలు ఇక్కడ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇంతటి కార్యక్రమానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖకు ధన్యావాదాలు తెలుపుతున్నామన్నారు. భారతదేశం సంప్రదాయాలకు ప్రతీక అని, నాలుగు వేదాలు చదివే పాఠశాల కేవలం వేములవాడలోనే ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల దేశవ్యాప్తంగా రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి మరింత ప్రచారం లభిస్తుందన్నారు. రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సువిశాలమైన గోశాల నిర్మాణానికి 40 ఎకరాల స్థలసేకరణ చేశామన్నారు. గత అసెంబ్లీ సమావేశాలలోనే వేములవాడలో వేద యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరామన్నారు. తుని పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి మాట్లాడుతూ రాజరాజేశ్వరస్వామి ఆలయం ప్రముఖపుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోందన్నారు. పలుమార్లు స్వామివారి దర్శనం చేసుకున్నామన్నారు. ప్రభుత్వం తలపెట్టిన ఆలయ అభివృద్ధి పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరగాలన్నారు. ఆలయ ఈవో రాధాబాయి, ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



రాయికల్‌లో రథయాత్రలో పాల్గొన్న భక్తులు

రాయికల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో గురువారం జగన్నాథ రథయాత్ర వైభవంగా జరిగింది. మెట్‌పల్లిలోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథయాత్ర పట్టణంలోని బస్టాండ్ నుంచి ప్రారంభమై గాంధీ చౌక్, పటేల్ విగ్రహం మీదుగా మార్కండేయ దేవాలయ ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి రథయాత్రలోపాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



ఇబ్రహీంపట్నంలో సహకార సంఘం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం వద్ద గురువారం యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. కొంతమందికే యూరియా ఇచ్చి స్టాక్ అయిపోయిందని సిబ్బంది చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశించినా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి వేరుగా ఉందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. సరిపడా యూరియా తెప్పించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని రైతులు విమర్శించారు. ఈ విషయమై ప్రాథమిక సహకార సంఘం సీఈవోను వివరణ కోరగా కేంద్రానికి 450 సంచుల యూరియా వచ్చిందని, ఒక్కొక్క రైతుకు మూడు సంచుల చొప్పున ఇచ్చామన్నారు. రెండు రోజుల్లో రైతులకు సరిపడా యూరియా తెప్పిస్తున్నట్టు సీఈవో తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



యజమానికి సెల్‌ఫోన్ అందజేస్తున్న కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ పోలీసులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేశారు. సప్తగిరికాలనీకి చెందిన అబ్దుల్‌రెహమాన్ తన స్మార్ట్‌ఫోన్‌ను 2024సెప్టెంబరు2న కరీంనగర్‌రూరల్ మండలం నగునూరు గ్రామంలో పోగొట్టుకున్నాడు. వెంటనే ఆయన రూరల్‌పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన రూరల్‌పోలీసులు, సీఈఐఆర్ టెక్నాలజీని ఉపయోగించి ఫోన్‌ఆచూకీ గుర్తించారు. పోగొట్టుకున్నఫోన్ కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. ఆ సెల్‌ఫోన్‌ను ఇప్పటివరకు ఉపయోగించిన వ్యక్తి ఫోన్‌ను పోలీసులకు అప్పగించాడు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న అబ్దుల్ రెహమాన్‌ను కరీంనగర్‌రూరల్ పోలీసుఠాణాకు పిలిపించారు. రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను తిరిగి అతడికి అప్పగించారు. ఫోన్‌ను ట్రేస్ చేయడంలో కృషిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

వీణవంక, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో గురువారం గ్రామస్థులు ఇసుకలారీలను అడ్డుకున్నారు. దాదాపు ఆరుగంటలపాటు లారీలను నిలిపివేశారు. కొండపాక గ్రామంలోని మానేరువాగు క్వారీలో తమ గ్రామస్థులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వారంక్రితం ధర్నా చేసిన గ్రామ స్థులను అధికారులు క్వారీ యాజమానులతో మాట్లాడి ఉపాధి కల్పిస్తామని తెలిపారని అన్నారు. అయితే ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఉపాధి కల్పించలేదని అన్నారు. ఆరు గంటలపాటు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు.




హిమ్మత్‌నగర్‌లో ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

మళ్లీ మొదలవనున్న కల్వర్టు కష్టాలు

● హైలెవల్ వంతెనలు నిర్మించాలని ప్రజల డిమాండ్

గన్నేరువరం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలవడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న లోలెవల్ కల్వర్టులతో ఈ ఏడాది కూడా కష్టాలు తప్పేలా లేవు. మండల కేంద్రంలోని చెరువువద్ద ఉన్న లోలెవల్ కల్వర్టు రెండువైపులా కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. వర్షాలు బాగా కురిసి చెరువు నిండి కల్వర్టుపై నీరు ప్రవహిస్తే కల్వర్టు కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. ప్రతి వర్షాకాలం మండలంలోని జంగపల్లి నుంచి హన్మాజిపల్లి ఎక్స్‌రోడ్డు మధ్యలో ఉన్న లోలెవల్ కల్వర్టు, అలాగే పారువెల్ల నుంచి ఖాసింపేట గ్రామాల మధ్యన ఉన్న కల్వర్టు, గన్నేరువరం చెరువు వద్ద ఉన్నకల్వర్టువద్ద నీటి ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇటీవల గుండ్లపల్లి నుంచి గునుకుల కొండాపూర్ వరకు నిర్మించిన డబుల్ రోడ్డులో సైతం గునుకుల కొండాపూర్‌వద్ద కల్వర్టు నిర్మించకుండానే మట్టినిపోసి వదిలేశారు. దీంతో చిన్నపాటి వర్షాలకే మట్టి రోడ్డుకు గండిపడుతోంది. భారీవర్షాలు కురిస్తే రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉన్నది. ప్రతియేడు ఆయాకల్వర్టులు దాటడా నికి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఆయా కల్వర్టుల వద్ద హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించి సమస్యలను తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గన్నేరువరం చెరువు వద్ద ప్రమాదకరంగా రెండు వైపులా కుంగిన లోలెవల్ కల్వర్టు



గునుకుల కొండాపూర్ వద్ద వరద నీటితో గండికొట్టిన మట్టి రోడ్డు

రేపు ఉమ్మడి జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

మార్కండేయకాలనీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు అర్హులైన అభ్యర్థులకు ఈనెల 5న గోదా వరిఖని సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పోటీలు నిర్వ హించనున్నట్టు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, ఫుట్‌బాల్ కిట్‌తో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల9న మంచి ర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు జనవరి 1, 2009 నుంచి డిసెంబర్ 31,2011మధ్య జన్మించిన వారు అర్హులని, ఇతర వివరాలకు 9550903088, 9908839896 నంబర్లో సంప్రదించాలని కోరారు.

60 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

● గొల్లపల్లిలో టాస్క్‌ఫోర్సు పోలీసుల దాడులు

● రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు



స్వాధీనపర్చుకున్న బియ్యం

ఎల్లారెడ్డిపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠినచర్యలు తప్పవని టాస్క్‌ఫోర్సు సీఐ నటేశ్ హెచ్చరించారు. ఎస్పీ మహేశ్ బీ గితే ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో బుధవారం స్థానిక పోలీసులతో కలిసి ఆయన మెరుపు దాడులు నిర్వహించారు. గ్రామంలోని బీనవేని దేవయ్య ఇంటిలో అక్రమంగా నిల్వచేసిన 60 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. దేవయ్య తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర పట్టణాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నాడని గుర్తించారు. పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం అక్రమ రవాణాచేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. పేదల బియ్యంపై నిరంతరం నిఘాను తీవ్రతరం చేసి దాడులు నిర్వహించి అడ్డుకట్ట వేస్తామని పేర్కొన్నారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం అమ్మిన, కొనుగోలు చేసిన తమకు ప్రజలు సమాచారం అందించాలని టాస్క్‌ఫోర్సు సీఐ నటేశ్ కోరారు. కేసు నమోదు చేశామని స్థానిక పోలీసులు వివరించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్సు సిబ్బంది తిరుపతి, రాజేశ్, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


shanthi TALKIES
MYTHRI
RELEASING TODAY
SIDDHARTH
SARATH KUMAR
3BHK
'Every Ordinary Family has an Extraordinary Story'
WRITER - DIRECTOR SRI GANESH
PRODUCED BY ARUN VISWA
PRODUCED BY ARUN VISWA


ప్రపంచవ్యాప్తంగా
నేడే
విడుదల
జురాసిక్ వరల్డ్
IN CINEMAS JULY 4
RELEASING IN ENGLISH, HINDI, TAMIL AND TELUGU
IN 3D
UNIVERSAL


ANIL SUNKARA PROUDLY PRESENTS
SKYLINE MOVIES
SHOW TIME
నేడే
విడుదల
WRITTEN & DIRECTED BY
MADHAN DAKSHINAMOORTHY
PRODUCER
KISHORE GARIKIPATI (G K)


ప్రపంచవ్యాప్తంగా
జూలై
11
విడుదల
IT BEGINS
A JAMES GUNN FILM
DC STUDIOS
సూపర్‌మ్యాన్
SUPERMAN
ONLY IN CINEMAS JULY 11
IN ENGLISH, HINDI & TELUGU
IN 3D & IMAX 3D
REAL D 3D Dolby Cinema IMAX
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


SMT.ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
DIL RAJU PRODUCTION
T-SERIES
నేడే
విడుదల
NITHIIN
తమ్ముడు
SRIRAM VENU
RAJU SHIRISH
K V GUHAN B.AJANEESH LOKNATH SH.PRAWIN PUDI G M SEKHAR

డబుల్ బెడ్‌రూంల ఇళ్లకు మోక్షం

(5వ పేజీ తరువాయి)

650 ఇండ్ల నిర్మాణాల తాగు నీటి సౌకర్యానికి 3 కోట్ల 10 లక్షలు, విద్యుత్ సౌకర్యం కోసం కోటి 24 లక్షలు, మురికి కాలువల నిర్మాణాలకు 3కోట్ల 50 లక్షల రూపాయలను మంజూరు చేశారు. ప్రస్తుతం కాల్వ శ్రీరాంపూర్, ఓదెలలో విద్యుత్తు సౌకర్యం కల్పించే పనులు పూర్తి కాగా, ఇతర పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని హౌసింగ్ పీడి రాజేందర్ తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నాటికి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఓదెల, రామగుండంలో నిర్మించిన ఇండ్లకు ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక పూర్తి కాగా, కాల్వశ్రీరాంపూర్‌లో 240 ఇండ్లకు 150 మంది లబ్ధిదారులను ఇదివరకే ఎంపిక చేశారు. ఇంకా 90 ఇళ్లకు ఎంపిక చేయాల్సి ఉంది. ఇందిరమ్మ ఇండ్ల పథకం సందర్భంగా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హుల్లో ఎల్2 కేటగిరీలో సొంత ఇంటి స్థలం లేని లబ్ధిదారులకు ఇండ్లను మంజూరు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించే విషయమై ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో బడుగు బలహీన వర్గాల ప్రజల కల నెరవేరనున్నది.

అర్హులందరికీ ఓటరు నమోదు చేయాలి

పెద్దపల్లి రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఉద్యోగి ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించాలని ఆర్డీవో గంగయ్య తెలిపారు. గురువారం తహసీల్దార్ రాజయ్య ఆధ్వర్యంలో బూత్ స్థాయి అధికారులకు, బిఎల్‌వోలకు, సూపర్‌వైజర్‌లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీవో గంగయ్య మాట్లాడుతూ ఫారం -6, 7, 8ల ప్రాధాన్యతను వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ విజేందర్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు తమకు అప్పగించిన పనులను సక్రమంగా నిర్వహించాలని ఆర్డీవో సురేష్ అన్నారు. నాగారం రైతువేదికలో తహసీల్దార్ ముస్త్యాల వాసంతి ఆధ్వర్యంలో బీఎల్‌వోలకు శిక్షణను మాస్టర్ ట్రైనర్ మెరుగు రాజమౌళితో కలిసి నిర్వహించారు. 18 ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని తెలిపారు. ఎవరైనా ఊరు విడిచి వెళ్లి పోయినా, మరణించినా పేర్లు తొలగించాలని పేర్కొన్నారు. ఆర్‌ఐ స్రవంతి, సీనియర్ అసిస్టెంట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): అధికారులు ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య బిఎల్‌ఓలను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల నియామవళిపై బీఎల్‌వోలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ జక్కని స్వర్ణ, మాస్టర్ ట్రెయినర్ రాజెందర్, ఆర్‌ఐ భవానిప్రసాద్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి):బీఎల్‌ఓలు తమకు అప్పగించిన పనులను సక్రమంగా నిర్వహించాలని ఆర్డీఓ గంగయ్య అన్నారు. బీఎల్‌ఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా ఊరు విడిచి వెళ్లిపోయినా, మరణించినా వారి పేర్లు తొలగించాలన్నారు. తహసీల్దార్ బషీరొద్దిన్, అధికారులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఓటరు నమోదుపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఆర్డీఓ గంగయ్య మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునే విధానం తదితర అంశాలపై వివరించారు. తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్ నడిపితే జరిమానా

కమాన్‌పూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లను తిప్పితే జరిమానాలు తప్పవని ఎంపీడీవో తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కేజ్‌వీల్స్‌ను రోడ్లపై నడిపితే రహదారులు దెబ్బతింటాయన్నారు. పారిశుధ్యం, మంచినీటి సరఫరా, క్లోరినేషన్, ఓహెచ్‌ఆర్ ట్యాంకుల శుభ్రంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

మంథని: రోడ్లపై కేజ్‌వీల్స్ నడిపిస్తే జరిమానా విధించాలని ఎంపీడీవో శశికళ సూచించారు. ఎంపీవో, ఏపీవో, ఎంబీ ఏఈలు, టీఏలు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వన మహోత్సవం, నీటి సరఫరా గురించి చర్చించారు.

రహదారిని చదును చేసిన కాంగ్రెస్ నాయకులు



బురదమయమైన దారిని చదును చేయించిన నాయకులు

ముత్తారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పోతారం గ్రామంలో చెరువుకట్టపై ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయం కాగా కాంగ్రెస్ నాయకులు రహదారిని చదును చేశారు. గురువారం ట్రాక్టర్‌తో మట్టిని పోసి చదును చేయించి గ్రామస్థుల రాకపోకలకు అనువుగా ఉండేలా చేశారు. బురదమయమైన దారిని చదును చేయడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నర్ర మల్లయ్య, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్, మాజీ ఎంపీటీసీ భారత లక్ష్మీకొమురయ్య, బత్తుల మల్లయ్య, ఇట్టం గట్టయ్య, వల్లెపు మొగిలి, నర్ర ఓదెలు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పాలకుర్తి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కొత్తపల్లి, రామారావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను పరిశీలించారు. జయ్యారంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, ఎస్సీ సంక్షేమ వసతి గృహం, కన్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పుట్నూర్‌లోని కేజీబీవి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, అంగన్వాడి కేంద్రం, ఎంపీడివో కార్యాలయంను కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. మార్చి వరకు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, బేసిక్ మ్యాథ్స్ చేసేలా తయారు చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటాలని, డ్రైనేజీల్లో సిల్ట్ పూర్తి స్థాయిలో తొలగించాలని సూచించారు.

మహిళా సంఘాలకు బీమా చెల్లింపు

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లోన్ బీమా ప్రమాద బీమా పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు మరణించిన 91 మంది మహిళలకు రూ.1,39,96,861 చెల్లింపులు జరిగినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం పేర్కొన్నారు. మహిళా సంఘాల్లోని మహిళలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తూ బీమా పథకాలను అమలు చేస్తుందన్నారు. సంఘాల్లోని మహిళలు ప్రమాదవ శాత్తు మరణిస్తే బీమా కింద నామినీకి రూ.10 లక్ష లు అందిస్తామన్నారు. మహిళ సహజంగా మరణిస్తే గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు బీమా ఉంటుందన్నారు. ప్రమాదంలో శాశ్వత అంగవైకల్యం 50 శాతంపైగా ఏర్పడితే రూ.5 లక్షల వరకు బీమా వర్తిస్తుందన్నారు. మంథని నియోజకవర్గ పరిధిలో 18, పెద్దపల్లి 42, రామగుండం పరిధిలో 16, ధర్మారంలో 7 సహజ మరణాలకు చెల్లించినట్లు పేర్కొన్నారు. మం థనిలో 1, పెద్దపల్లిలో 4, రామగుండంలో ఒకరికి చెల్లించినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

మంథని, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీధర్ గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇటీవల జరిగిన సమీక్షలో సూచించిన విధంగా త్వరలో స్కానింగ్ పరికరం, ఫొటోథెరపి, వార్మర్ల ఏర్పాటు చేస్తామన్నారు. ఆసుపత్రిలో, ఎంసీహెచ్‌లో బయో మెట్రిక్ అటెండెన్స్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. రెఫెరల్ కేసులు తగ్గించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి

జూలపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వడుకాపూర్ గ్రామానికి చెందిన రావుల బలరాం (103) శతాధిక వృద్ధుడు గురువారం మృతి చెందాడు. బలరాం గ్రామంలో 80 ఏళ్ళుగా నాటువైద్యుడిగా ప్రజలకు సేవలందించాడు. వృద్ధాప్యంతో బాధపడుతున్న బలరాం మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంత్యక్రియలకు ప్రజలు తరలివచ్చారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

ధర్మారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కటికెనపల్లి ప్రాథమిక పాఠశాలలో 3వ, తరగతి చదువుతున్న పి.స్వప్నిక, 5వ, తరగతి చదువుతున్న ఎం.రామ్ చరణ్‌లు పాఠశాలకు క్రమం తప్పకుండా వస్తున్నారు. వారికి ప్రోత్సాకంగా హెచ్‌ఎం మోతిలాల్ చెరో 2వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని వారి తల్లిదండ్రుల సమక్షంలో గురువారం అందించారు.

దారి మైసమ్మకు ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు జరుగకుండా గమ్యం చేర్చు తల్లీ అంటూ స్థానిక లారీ డ్రైవర్లు, ఓనర్లు దారి మైసమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం సుల్తానాబాద్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైస్‌మిల్లుల ప్రాంతంలో మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. అనంతరం చిన్నకలువల బ్రిడ్జి వద్ద, రేగడిమద్దికుంట, రైల్వే వ్యాగన్ షెడ్డు, ఇరుకుల్ల తదితర ప్రాంతాలలోని అమ్మ వార్లకు బోనాలు గొర్రెపోతులను సమర్పించి పూజలు చేశారు. మాజీ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కంకనాల తిరుపతి, ఉపాధ్యక్షుడు బోయిని శ్రీనివాస్, కార్యదర్శి రాకేష్, కోశాధికారి రమేష్ పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీ పరిధిలోని పన్నూరు చౌరస్తాలో రామగిరి ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దారి మైసమ్మకు మొక్కులు చెల్లించారు. యేటా ఆషాఢమాసంలో రైతులు, ప్రజలు చల్లగా ఉండాలని పూజలు చేశారు. నాయకులు మోల్మామూరి సత్యం, వేగోలపు సత్యనారాయణ, నాడేంలింగయ్య, కృష్ణస్వామి, తీగల శ్రీధర్, రంగు నరసయ్య, తొట్లమల్లయ్య, గీరవేని రాములు, కొండవేన ప్రభాకర్, బబ్లూలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ

సుల్తానాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కొనసాగుతున్న ఖేలో ఇండియా ఖోఖో శిక్షణ కేంద్రం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. స్వర్గీయ దాసరి రాజన్న స్మారకార్థం వారి కుమారుడు పీఈటీ దాసరి రమేష్ విద్యార్థులకు పండ్లు సమకూర్చగా స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కార్యదర్శి తిరుపతి, ఖేలో ఇండియా కోచ్, గెల్లు మధుకర్ తదితరులు పంపిణీ చేశారు. పీడీ అంతటి శంకరయ్య, బండారి కమలాకర్, వెంకటస్వామి, ప్రభాకర్, గోపీ, పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న ట్రాఫిక్ సిబ్బంది

కోల్‌సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మున్సిపల్ జంక్షన్ వద్ద రాజీవ్ రహదారిపై గురువారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు, ట్రాఫిక్ సీఐ అనీల్, మంచిర్యాల ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు, 20మంది సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్‌లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీటు బెల్ట్ పెట్టుకోకుండా వాహనాలు నడిపే వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అధిక శబ్దకాలుష్యానికి వినియోగిస్తున్న సైలెన్సర్లపై అవగాహన కల్పించేందుకు స్టాపర్‌ను మున్సిపల్ జంక్షన్ వద్ద డెమో ఇప్పించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, తప్పకుండా హెల్మెట్ ధరించేలా చూడాలని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. అతి వేగంగా వెళ్లే వాహనలను సీజ్ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో రామగుండం ట్రాఫిక్ ఎస్‌ఐ హరిశేఖర్ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతిలో గనుల మూసివేత

గోదావరిఖని, జూలై 3(ఆంధ్రజ్యోతి): పర్యా వరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని బొగ్గు నిల్వలు పూర్తయి మూతపడిన 143 కోల్ మైన్స్‌ను ఆధునిక పద్ధతిలో మూసివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు కేంద బొగ్గు శాఖా మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం హైద్రాబాద్‌లో బొగ్గుగనుల శాఖకు సంబంధించి కన్సల్టేటివ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో గనుల మూసివేత, మినరల్ ఎక్స్‌ప్లోరేషన్‌కు సంబంధించిన అంశాలపై కోల్ మైనింగ్ సంస్థల అధికారులతో చర్చించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక కోల్‌మైన్స్‌ను మూసివేసి ఆభూమిని తిరిగి ఉప యోగపడేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. గనుల మూసివేసే క్రమంలో అక్కడి ప్రజలు, రైతులకు ఉపయోగపడేలా అవసర మైన కార్యాచరణ రూపొందించుకోవాలని ప్రధాని సూచించినట్టు పేర్కొన్నారు. ఉద్యోగుల ఇన్సూరెన్స్ విషయంలో కేంద్రం చొరవతీసుకుని ప్రస్తుత ఇన్సూరెన్స్ మొత్తానికి అదనంగా కోటి రూపాయలు ఇస్తున్నట్టు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం హార్ట్‌ఫుల్ నెస్ సంస్థతో కోల్ ఇండియా, సింగరేణి సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. బొగ్గు గనుల శాఖా సహాయ మంత్రి సతీష్ చంద్రదుబే, కమిటీ సభ్యులైన ఎంపీలు, గనుల శాఖా ఉన్నతాధికారులు, కోల్ ఇండియా చైర్మన్ పీఎం ప్రసాద్, సింగరేణి సీఎండీ ఎన్ బలరాం నాయక్‌తో పాటు వివిధ బొగ్గు సంస్థల అధికారులు పాల్గొన్నారు.



ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న బొగ్గు సంస్థల అధికారులు



పచ్చదనం పెంపుదలకు కన్హా ఆశ్రమంతో ఒప్పందం

గోదావరిఖని, జూలై 3(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పచ్చదనం పెంపునకు ప్రముఖ యోగా పర్యావరణ పరిరక్షణ సంస్థ అయిన కన్హా ఆశ్రమం(హార్ట్‌ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్)తో యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకున్నది. గురువారం హైద్రాబాద్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో సీఎండీ బలరాం, కన్హా డైరెక్టర్ సంజయ్ సెహగల్‌లు ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈఒప్పందం ప్రకారం సింగరేణి ప్రాంతాల్లో కన్హా ఆశ్రమం నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు నాటి వాటిని సంరక్షించనున్నది. ఎకో పార్కులను నిర్మించడం, హరిత కంచెల ఏర్పాటు వంటి పర్యావరణహిత చర్యలు చేపట్టనున్నది. ఓపెన్‌కాస్ట్ ఓబీ డంపులు, ఖాళీ ప్రదేశాల్లో, బొగ్గు రవాణా బెల్టులకు, రోడ్లకు ఇరువైపుల మొక్కలు పెంచునున్నారు. సింగరేణి సమీప గ్రామాల ప్రజలను భాగస్వాములు చేస్తూ వారి అవసరాలకు, ఉపాధి కల్పనకు సంస్థ పని చేయనున్నది. కేంద్ర బొగ్గు గనుల శాఖా సహాయ మంత్రి సతీష్‌చంద్ర దుబె, బొగ్గు శాఖా అదనపు కార్యదర్శి రూపేంద్ర సింగ్‌బ్రార్, సింగరేణి డైరెక్టర్(పా) గౌతం పొట్రు పాల్గొన్నారు.

కార్మికులను బలవంతంగా నైనీ బ్లాక్‌కు పంపొద్దు

గోదావరిఖని, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని నైనీ బ్లాక్‌కు సింగరేణి కార్మికులను, ఉద్యోగులను బలవంతంగా పంపొద్దని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం భాస్కర్ రావుభవన్‌లో జరిగిన ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ క్లర్క్‌లను, సెక్యూరిటీ గార్డులను, ఇతర వృత్తులలో పని చేస్తున్న కార్మికులను సర్క్యులర్ జారీ చేస్తూ బలవంతంగా పంపడం సరికాదన్నారు. క్లరికల్ విభాగంలో 365ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిందని, మెరిట్ ఆధారంగా వాటిని భర్తీ చేయాలని కోరారు. యాక్టింగ్ క్లర్క్‌లు కూడా రెగ్యులరైజ్ చేయాలని వారు కోర్టుకు వెళ్ళారని, యాజమాన్యం కోర్టు కేసును వెకేట్ చేయించి వారిని ఖాళీల ఆధారంగా నిబంధనల ప్రకారం తీసుకోవాలన్నారు. మడ్డి ఎల్లా గౌడ్, స్వామి, ఆరెల్లి పోషం, సయ్యద్ సోహేల్, బండి మల్లేష్, ఎంఏ గౌస్, పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గోదావరిఖని, జూలై 3(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈ నెల 9న సింగరేణిలో జరిగే సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. గురువారం ఆర్‌జీ-1 ఏరియాలోని ఓసీపీ-5లో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కొరిమి రాజ్ కుమార్, సదానందం, శ్రీనివాస్, వడ్డేపెల్లి శంకర్, కట్ట విశ్వనాథంలు గేట్ మీటిగ్ నిర్వహించారు. సమ్మెను విజయవంతం చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఆరెల్లి పోషం మాదన మహేష్, బోగ సతీష్‌బాబు, గుర్రం ప్రభుదాస్, పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): సమ్మెను విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు లుక శంకర్ అన్నారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మోదీ సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తోందన్నారు. సుప్రీం కోర్టు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఇచ్చిన తీర్పును ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఐఎఫ్‌టియు నాయకులు జి.కుమార్, ఆర్.రాయమల్లు, రవిందర్, సుధాకర్, డి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు



ఆర్జీ-2 అధికారులతో సమావేశమైన సీఎంపీఎఫ్ కమిషనర్లు

రామగిరి, జూలై 2(ఆంధ్రజ్యోతి): జాప్యం లేకుండా కోల్‌మైన్స్ ప్రావిడెంట్‌ఫండ్ సేవలను ఉద్యోగులకు అందించేందుకు కృషి చేస్తున్నామని సిఎంపిఎఫ్ కమిషనర్లు హరి పచౌరి, గోవర్ధన్‌లు అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగులతో ప్రయాస్ పై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సిఎంపిఎఫ్ లావాదేవీలు సి-కేర్స్ పోర్టర్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఉద్యోగులు మధ్యవర్తులు లేకుండా సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు. సిఎంపిఎఫ్ బెనిఫిట్స్‌కు అర్హులు, పెన్షన్, రివైజ్డ్ పెన్షన్‌పై అవగాహన కల్పించారు. 11వ వేజ్‌బోర్డు సంబంధించిన 228 పిపిఓ ఆర్డర్స్‌ను ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు అందజేశారు. అధికారులు రామ్మోహన్, సుదర్శనం, రాజేశం, శిరీష, భారతి, కామేశ్వరరావు, అనిత, లలిత, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): సీఎంపీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రయాస్‌లో భాగంగా సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్లు ఆర్జీ-2 యాజమాన్యంతో సమావేశమయ్యారు. సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్-1 శ్రీహరి ఎచోరి, కమిషనర్-2 గోవర్ధన్‌లు మాట్లాడుతూ భవిష్య నిధి, పెన్షన్ దావాలను తక్షణ పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకొంటామన్నారు. సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించిన సీఎంపీఎఫ్ నంబర్ అలాట్‌మెంట్, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు క్లయిమ్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య కోరారు. ఉద్యోగులకు ఎలాంటి జాప్యం లేకుండా సీఎంపీఎఫ్‌ను త్వరితగతిన చెల్లించడానికి కృషి చేయనున్నట్లు సీఎంపీఎఫ్ కమిషనర్లు పేర్కొన్నారు. ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఫైనాన్స్ మేనేజర్ తిరుపతిరెడ్డి, వెల్ఫేర్ ఆఫీసర్ అజీజ్, అకౌంట్స్ అధికారి విశాల్‌రెడ్డి, సీఎంపీఎఫ్ అధికారులు కమలేష్‌రావు, శ్రీనివాసరావు, అనిత, వరప్రసాద్ పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని టీబీజీకేఎస్ నాయకులు కమిషనర్ బృందానికి వినతిపత్రాన్ని అందజేశారు. 11వ వేజ్‌బోర్డు కాలంలో ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు పెరిగిన పెన్షన్ ఇప్పించాలని, సీఎంపీఎఫ్ రుణాల ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 2023-24, 2024-25 సంబంధించిన సీఎంపీఎఫ్ బ్యాలెన్స్ చిట్టీలను అందజేయాలని, సీ కేర్స్‌కు సంబంధించిన పోర్టల్‌లో సీఎంపీఎఫ్ లెక్కలను సరిచేసి వెబ్‌సైట్‌లో ఉంచాలని, కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్, పెన్షన్ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఏరియాల వారీగా గ్రీవెన్స్ మీటింగ్‌లు ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ బృందం కమిషనర్లను కోరింది. ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బేతి చంద్రయ్య, కమలాకర్, బురికి రమేష్, రవి ఉన్నారు.



ఆర్డర్ కాపీలను జీఎంకు అందజేస్తున్న సీఎంపీఎఫ్ కమిషనర్లు

బహిరంగ సభను విజయవంతం చేయాలి

పాలకుర్తి, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఎల్బీ స్టేడియంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించే సభను విజయవంతం చేయాలని బసంత్‌నగర్ మాజీ సర్పంచ్ పర్మవేణి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతారన్నారు. గురువారం ప్రెస్‌భవన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతర్గాం, పాలకుర్తి మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, భూమ్‌రెడ్డి, లింగయ్య గౌడ్, రాములు, తుంగ నర్సయ్య, పాల్గొన్నారు.

షీటీమ్‌పై విద్యార్థులకు అవగాహన

కోల్‌సిటీటౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ హైస్కూల్‌లో విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీమ్ ఇన్‌చార్జి ఎస్‌ఐ లావణ్య మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. బస్టాండ్, జన సమీకరణ ప్రాంతాల్లో, కళాశాలల వద్ద షీటీమ్ నిరంతరం పనిచేస్తుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురైతే 6303923700కు ఫోన్ చేసి సమస్య తెలపాలన్నారు. సైబర్ నేరాలపై, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. షీటీమ్ సభ్యులు స్నేహలత, మౌనిక, సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు



చెక్కు అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

కాల్వశ్రీరాంపూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాండవుల గుట్టపై నిర్మిస్తున్న అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి మొట్లపల్లి గ్రామానికి చెందిన జంగ నర్మద ప్రభాకర్ రెడ్డి రూ.2 లక్షల ఆర్థికసాయం గురువారం అందించారు. ఆలయ నిర్వాహకులు పెద్దిరెడ్డి వీరారెడ్డికి అందించగా, సాంబశివరెడ్డి, ప్రసాద్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పందిళ్ల గ్రామంలో రజక కులస్తులు నిర్మిస్తున్న మడలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి రూ.10,016, మాజీ సర్పంచ్ శ్రీదేవి రాజు రూ.2016 విరాళంగా అందజేశారు.

పట్టణ సమస్యలు పరిష్కరించాలి

సుల్తానాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ పట్టణ నేతలు మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్‌ను కోరారు. పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యక్షుడు సతీష్, ఓబీసీ జిల్లా కార్యదర్శి సదయ్య, గజబీంకార్ పవన్, వేముల శ్రీనివాస్ గురువారం కమిషనర్‌ను కలసి సమస్యలను ప్రస్తావించారు. అనంతరం సన్మానించారు. రజక సంఘం అధ్యక్షుడు నిట్టూరి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు రాజేశం, ఉపాధ్యక్షుడు అంజయ్య, తదితరులు కమిషనర్‌ను సన్మానించారు.

కేంద్ర పథకాలకు ప్రజలకు వివరించాలి

కమాన్‌పూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆదివరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. నాయకులు మత్స్యగిరి రాము, మట్ట శంకర్, జంగేపల్లి అజయ్, మల్లారపు అరుణ్ పాల్గొన్నారు. మండల ఉపాధ్యక్షులుగా బర్ల సదానందం, బుదార్తి శ్రీనివాస్, కొమ్ము శ్రీనివాస్, పిల్లి చంద్రయ్య, ప్రధాన కార్యదర్శులుగా విశ్వతేజ, పెద్దపల్లి శ్యాంసుందర్, కార్యదర్శులుగా ప్రశాంత్, శ్రీనివాస్, శ్రావణ్‌లను ప్రకటించారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలి

పాలకుర్తి, జూలై 3(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, యువత చెడుమార్గాలపై ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని ఎస్‌ఐ స్వామి తెలిపారు. గురువారం బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు.

ఆన్‌లైన్ మోసాల పై అవగాహన

రామగిరి, జూలై 3(ఆంధ్రజ్యోతి): బేగంపేట్ గ్రామంలో గురువారం ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్‌లలో వచ్చే తెలియని లింకులను ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు. దీంతో డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయ్యే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ఓటీపీలను ఎవరికీ తెలుపవద్దన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మత్తు పదార్థాల బారిన పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ మల్లేష్ అన్నారు. గురువారం గౌరెడ్డిపేటలో యువకులకు. గ్రామస్తులకు గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

కమాన్‌పూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ నగర్‌కి చెందిన నగునూరి అనిల్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఛత్రపతి శివాజీ యువసేన బాధ్యులు రూ.86 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అనిల్‌కు మెదడులో రక్తం గడ్డ కట్టడంతో రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు సూచించారు. నిరుపేద కుటుంబం కావడంతో సభ్యులు, మిత్రులు, సోషల్ మీడియా ద్వారా సేకరించిన మొత్తాన్ని గురువారం అందజేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షుడు జంగపల్లి శ్రీనివాస్, బీజేపీ నాయకులు మచ్చగిరి రాము, రవి, మల్యాల శేఖర్, పాల్గొన్నారు.

మర్రివాడలో బోనాలు

మంథని, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మధున పోచమ్మ, రేణుకా ఎల్లమ్మ తల్లులకు మర్రివాడ ప్రజలు గురువారం సామూహికంగా బోనాలు సమర్పించారు. మాజీ ఉప సర్పంచ్ పుప్పాల భాగ్యలక్ష్మి-తిరుపతిల ఆధ్వర్యంలో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు.

పోలీసు ఉన్నతాధికారులను కలిసిన ఆర్టీఏ మెంబర్

మంథని, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్‌లను జిల్లా ఆర్టీఏ మెంబర్ మంథని సురేష్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ కోసం ప్రజల్లో అవగాహన, తీసుకోవాల్సిన చర్యల పై చర్చించారు.